# సెల్ ! బాబోయ్ హెల్

" అలో అప్పిగా ! నేనురా సుబ్బిగాడ్ని ! ఇక్కడ ఏదో ఫంక్షను జరుగుతున్నది... నువ్వు లగెత్తుకొచ్చెయ్యి ఆ !! ఆవీధిలో కూడా ఏదో సంతర్పణ జరుగుతున్నదీ ! నీ ఇష్టం, ఇక్కడ బానే వుంది. ఈ బాబు ధర్మబాబు. పెట్టేచెయ్యే ! ఉంటా !" సుబ్బిగాడు సెల్ ఆఫ్ చేశాడు. కొంచెం పక్కకొచ్చి మళ్ళీ డ్యూటీలోకి దిగిపోయాడు - కాదు ఎక్కాడు.

" మాదా కవళం తల్లి - కుంటివాడ్ని ! ధర్మం చెయ్యండి " అంటూ ఓ తలుపుకు వేలాడసాగాడు.

సదరు తలుపు ఓనరు వెంకటరావు ఇందాకటి నుండి సుబ్బిగాడ్ని గమనిస్తున్నాడు. అందువలన బయటకొచ్చి - ఓ పావలా బిళ్ళ వేసి ఆరా మొదలెట్టాడు.

" నీ పేరేంటిరా !"

" సుబ్బిగాడండి!"

" ఇందాకేదో మాట్లాడుతున్నావు ? ఏవడితోరా !"

" ఇందాకండి బాబయా ! ఎవరితొండీ !"

" అదేరా - ఎవడ్ని పిలుస్తున్నావు. ఈ వీధిలో దానం చేసేవాళ్ళున్నారని - లగెత్తుకు రమ్మన్నావు !?"

" అవును బాబయ్యా - మా అప్పిగాడ్ని రమ్మన్నా ! ఆ మాత్రం అండర్‌స్టాండింగ్ లేకపోతే కష్టమయిపోతుంది బాబయ్యా ! మా వృత్తిలో కొన్ని రూల్సు - రెగ్యులేషన్స్ వున్నాయి బాబయ్యా. ఈయాల నేపిలిస్తే ... రేపెప్పుడన్నా ఆడు పిలుస్తాడు నన్ను !" వివరించాడు సుబ్బిగాడు హుందాగా.

" అది కాదురా ! సుబ్బిగా ! నీకేమన్నా కర్ణ పిశాచి ఉందా .... ఇక్కడ మాట్లాడితే అక్కడ యినపడ్డానికి? " ఎగతాళిగా అడిగాడు వెంకటరావు అనుమాన నివృత్తికోసం.

" ఈ పాటి దానికి అంత వాదన ఎందుకు బాబయ్యా ! ఓ సెల్లు కొడితే

చాలు " తాపీగా చెప్పాడు.

" ఏంటీ నీ దగ్గర సెల్లు ఉందా !!" ఆశ్చర్యపోయాడు వెంకటరావు.

" ఆ ! ఒకటి కాదు రెండున్నాయి. ఒకటి నా దగ్గర, ఇంకొటి మా ఆవిడ దగ్గర ! లేక పోతే చాలా ఇబ్బంది అయిపోతుంది. అది ఏడుంటుందో నేనడున్నానో అర్థం కాదు" సుబ్బిగాడు చెప్పాడు.

వెంకటరావు తల తిరిగిపోయింది.

" ఏం బాబయ్యా ! ఓ సెల్ దానం చేద్దామనుకుంటున్నారా ! మా బుడ్డోడికి కూడా ఒకటి కావాలట. ఇప్పించండి. మీ పేరు చెప్పుకుంటాం" చెప్పాడు సుబ్బిగాడు.

" సరేలే ! పోయిరా !" విసురుగా అని లోపలికొచ్చి కుర్చీలో కూర్చుండి పోయాడు వెంకటరావు నీరసంగా.

అతని చుట్టు గిర్రున గతం గుర్తుకొచ్చింది.

కొన్ని సంవత్సరాల క్రిందట కొనక కొనక వెంకటరావు ఓ సెల్ కొనుక్కున్నాడు పదివేలు తగలేసి. (అప్పట్లో – అంటే కొత్తల్లో – చాలా రేటు ఎక్కువ సల్లు)

అయిన దానికి కాని దానికి మొదట్లో దాంతోనే మాట్లాడేవాడు ఇంట్లో ఫోను వున్నా ! గొప్పలు పోయి.

దాని దెబ్బ నెల తర్వాత తెలిసింది అబ్బా అని తలపట్టుకున్నాడు. దానివాడకంలో వచ్చిన బిల్లుని చూసి.

ఆ తర్వాత జాగ్రత్త పడటం మొదలెట్టడు ఆచితూచి కాల్స్ చేయడం సాగించాడు.

కాని ఇన్‌కమింగ్‌కు కూడా బిల్లు పడడం వలన చాలా కాలం బిల్లు మోగిపోయింది. ( అప్పట్లో సెల్లు కంపెనీల మధ్య ఇంత పోటీలేదు. )

ప్రతి అడ్డమైన వెధవకి సెల్‌నెంబరు ఇవ్వడం వలన, డబ్బాలో ఒక రూపాయి నాణెం వేసి అవతలివాడు మాట్లాడేవాడు. కాని ఇతగాడికి బిల్లు అదిరింది. మరీ వేరే రాష్ట్రాల నుండి కూడా కాల్స్ వచ్చేవి. రోమింగ్ చార్జీలు వాచిపోయాయి.

ఆ దెబ్బతో పాత కనెక్షన్ కట్ చేసి కొత్త కనెక్షన్ తీసుకున్నాడు. ఇంకో కంపెనీ దగ్గర.

" ఏం గురూ ! సెల్ పని చేయడం లేదా !" అని కొందరు.

" ఏం భాయి ! బిల్లు బరువులో సెల్ డిస్‌కనెక్ట్ చేశావా !" అని మరికొందరు.

" సంపాదిస్తున్నదంతా ఏం చేస్తావ్ ! కట్టుకుపోతావా! ఆఖరికి సెల్ కూడా తీసేశావు?" అని కొందరు బంధువులు నిష్ఠూరమాడడం మొదలెట్టారు.

ఈ బాధ పడలేక కొత్త నెంబరు కూడా చాలామందికిచ్చాడు.

ఆధునిక మానవుడు అర్థం లేని పనులతో తన ఆరోగ్యం తానే పాడు చేసుకుంటున్నాడు. అందులో ఒకటి కూల్‌డ్రింక్స్ తాగడం, అయితే ఇంకోటి సెల్లు వాడడం.

' పొగతాగడం హానికరం' అని హెచ్చరించినా మానలేని వీక్‌నెస్ మనది.

మత్తు పదార్థాలు తీసుకోవడం ప్రమాదకరం అని తెలిసి కూడా మానలేని, మానుకోలేని మనస్తత్వం మనది!

టి.వి.కి అతుక్కుపోతే ముప్పు తప్పదు అని తెల్సినా కేబుల్‌కు బానిసల మయిపోయాం!

' అటువంటిది సెల్‌తో హెల్త్ నిల్' అన్నా ఊరుకుంటాడా వెంకటరావు. అది స్టేటస్ సింబల్‌గా మారిపోయింది.

ప్రతి కాలేజి కుర్రకారు.... నెత్తిమీద జుట్టు ఉన్న ప్రతివెధవ చెవికి అడ్డంగా ఒకటి పెట్టుకుని మాట్లాడడం అలవాటు చేసుకున్నాడు.

సంపన్నులు అయితే ఒకే ఇంట్లో ఉన్నా పైనుంచి కి,దకు దిగవచ్చును, కాని తమ బెడ్‌రూం వదిలి బయటకొచ్చి మాట్లాడే ఓపిక లేక ఒకళ్ళను మరొకళ్ళు సెల్లులోనే పలకరించుకుంటున్నారట!

ఈ కొత్త కనెక్షన్‌తో డబ్బు మిగులుతుందనుకుంటే ఇంకొంచెం ఖర్చు ఎక్కువొచ్చింది.

పైకి చెప్పేది ఒక స్కీం, తీరా బిల్లు వచ్చేసరికి అన్నీ ఎగస్ట్రాలే ! ఇడ్లీ ఇచ్చి ఛట్నీ మీద, సాంబారు మీద ఛార్జీ వేసినట్లు వేస్తున్నారు.

దాంతో వెంకటరావు కిందమీద పడ్డాడు, డబ్బు కట్టలేక మానుకోలేక.

పోటీ పుణ్యమని చివరికి ఇన్‌కమింగ్ పైన బిల్లు నిల్లు అయింది. ఆనందం పట్టలేక కొత్త కనెక్షన్ తీసుకుని తన వారందరికి నెంబరు ఇచ్చేశాడు.

ఇంకేముంది ప్రతి తలమాసిన వెధవ చేయసాగాడు. అప్పట్లో రూపాయి కాయిన్ బాక్స్‌లో రూపాయి వేసి ఆంధ్రులు ఎంతదూరమున్నా ఒకటిన్నర నిమిషాలు మాట్లాడేవారు. సెల్‌ఫోన్ నెంబరు చేసి.

వెంకటరావు మీటింగులు ఉంటే సెల్‌ఫోన్ మోగేది. బాసు చికాగ్గా చూసేవాడు.

వెంటనే వెంకట్రావు 'కూసేపాగి చేయి' అని చెప్పేవాడు. కట్ చేసేవాడు. కాని అవతలవాడికి వినపడక మళ్ళీ చేసేవాడు.

" వెంకట్రావు - కాన్ఫరెన్సులో వున్నప్పుడు సెల్ ఆఫ్ చేయాలన్న కామన్‌సెన్స్ వుందా నీకు!" బాసు నుండి చివాట్లు వచ్చేవి.

ఓసారి ఇంకా పెద్ద కాన్ఫరెన్సులో వున్నప్పుడు సెల్ వచ్చింది ఓ ఫ్రెండ్ నుండి .... 'వాళ్ళింట్లో పిల్లి పిల్లల్ని పెట్టిందని, ఇతగాడికి కావాలంటే యిస్తానని' పిల్లి ఏమో గాని - సూపర్‌బాసు మటుకు వెంటనే మెమో యిప్పించేశాడు ఇతగాడికి.

వెంకట్రావు కూడా కాస్త చార్జీలు కల్సివస్తాయని తన మిత్రులకు, అధికారులకు సెల్ చేస్తూ ఉంటాడు యస్.టి.డి చేయకుండా.

ఓ సారి అర్జంట్ పని పడి, రాత్రి అయిన తరువాత ఫోన్ చేశాడు. ఫోన్ ఎంగేజి వచ్చింది. సరే అని సెల్ చేశాడు. చాలా సేపటికి సెల్ ఎత్తారు.

" హలో సార్, నేను వెంకట్రావును సార్!" వినయంగా చెప్పాడు.

" బుద్ధి ఉందా లేదా - ఇప్పుడా చేయడం? " బాస్ కోపంగా అరిచాడు.

ఆయన శాంతస్వరూపుడు, బాసు అలా ఎందుకన్నాడో కొన్ని క్షణాలకు అర్థమయింది. వెనుక నుంచి వినవచ్చిన డైరెక్టరును బట్టి.

" ఈ సెల్ కాదు కాని కాపురాలు కూడా చేసుకోనిచ్చేట్టులేదు!" బాసు భార్య గట్టిగా తిడుతున్నది. అదంతా సెల్లులో వినిపించింది.

" సారీ సార్ ! అర్జెంటు పని అని చేశా !" చెప్పాడు వాళ్ళు ఎలా ఉన్నారో ఊహించుకొని.

" ప్రపంచం మునిగిపోవడం లేదుగా, రేపంటూ వుందిగా, రేపు దయచెయ్యి!" కట్ చేశాడు బాసు.

వెంకటరావుకు క్యాంపులు ఎక్కువ ! తరచు భార్యాబిడ్డలు ఎలా వున్నారని వాకబు చేస్తూ ఉంటాడు.

ఆ రోజున కక్కుర్తి పడ్డాడు. కింద వాళ్ళు ఇతగాడికి మంచి స్టార్ హోటల్లో, కంపెనీ అరేంజి చేశారు. వెంకటరావుకు ఇది కొత్త ! కాని కుతూహలం ! ఫ్రీగా వస్తే ఫినాయిలు అయినా లాగిస్తాడు. కింద వాళ్ళు ఎంతో ఖర్చు పెట్టి తెప్పించారుగా !"

మళ్ళీ శ్రీమతికి అనుమానం వస్తుందేమోనని, మధ్యలో రసాభాస అవుతుందేమోనని ముందు ఓ సెల్ చేశాడు.

" హలో ! నేను వెంకట్రావును మాట్లాడుతున్నా ! బాగున్నావా !"

" మీరా ! బాగున్నా ! ఎప్పుడొస్తున్నారు!" శ్రీమతి.

" రేపు రాత్రికి బయలుదేరి వచ్చేస్తాను, అంతా బాగున్నారుగా బాబిగాడు - బుజ్జీ !"

" అందరు మిమ్మల్ని అడుగుతున్నారు. తొందరగా రండి !"

" వస్తానులే ! ఇక్కడ అర్జెంటు పనులు ఇప్పుడు నా ముందు ఫైల్స్ వున్నాయి రాత్రి ఏ ఒంటిగంటవుతుందో, తప్పదు. ఇప్పుడు బద్ధకం చేసానంటే ఎల్లుండి కూడా వుండాల్సి వస్తుంది." బొంకులాడాడు ఎదురుగా వున్న అందాల బొమ్మను చూస్తూ.ఆమె కిసుక్కున నవ్వింది. గాజులు గలగలలాడాయి 'ష్!' అని సైగచేసాడు వెంకటరావు.

" సరే ! వీలైనంత తొందరగా రండి, ఉంటా !" అంటూ శ్రీమతి సెల్ పెట్టేసింది.

అందాల బొమ్మను చూస్తూ సెల్ పక్కన పెట్టేశాడు. ఆమె అసలే వగలాడి. పైగా కొన్ని పనులు పురమాయించి పంపించారుగా కొందరు.

ఇంకేం ముగ్గులోకి దింపింది. అలవాటు లేని మందు కొట్టించి, మజా చేయించింది.

బాత్‌రూంకు– పోదామని, సెల్ ఛార్జీలో పెడదామని చూస్తే 'ఆన్' లో వుంది. గుండెలు బాదుకున్నాడు. ఎప్పుడో చెయ్యిపడి ఆన్ అయినట్లుంది మళ్ళీ. లాక్ వేయడం అలవాటు లేదు.

ఆ మరునాడు శ్రీమతి పుట్టింటికి పోయి, విడాకుల నోటీసు పంపించింది.

దాన్ని ఉపసంహరింప చేయడానికి నానా గడ్డి కరవాల్సి వచ్చింది. గాడిద లాంటి మామకాళ్ళు – అత్తగారికాళ్ళు, ఆఖరికి పెళ్ళాం కాళ్ళు పట్టుకోవాల్సి వచ్చింది.

అత్తింట్లో పెద్ద పంచాయితీ అయింది.

సంఘానికి భయపడి, డైవర్స్ తీసుకుంటే, తన పరువు పోతుందని భయపడి, ఎలాగో శ్రీమతి పెట్టిన కండీషన్లకు ఒప్పుకుని ఆమెను వెంట పెట్టుకుని తెచ్చుకున్నాడు.

దాంతో సెల్ అంటే రోత పుట్టి దాన్ని తెగనమ్మేశాడు.

చాలా మంది సెల్ ఎందుకు తీసుకోవు అని అడుగుతుంటే ఇవన్నీ చెప్పలేక ఊరుకున్నాడు. కొన్ని సంవత్సరాలు సెల్లు సన్యాసం చేసాడు.

ఈ లోగా సెల్ విప్లవం వచ్చి ప్రతి పండ్లదుకాణం వాడు, ప్రతి వెధవ సెల్ వాడడం మొదలెట్టేశారు. మార్కెట్‌లో కూడా సెల్‌రేట్లు విపరీతంగా పడిపోయాయి.

కనెక్షన్ ధరలు మునుపటి కంటే కొంచెం తగ్గాయి.

వెంకట్రావు ఈ లోకంలోనికి వచ్చేసరికి శ్రీమతి ఏదో అంటున్నది.

" నాకు సెల్ కొనండి !" అని శ్రీమతి అడిగింది.

" నీ కెందుకే ! నీ కెవరున్నారు మాట్లాడ్డానికి ! ఎలాగూ ల్యాండ్ ఫోన్ వుందిగా, దాంతో మాట్లాడు" చెప్పాడు వెంకట్రావు.

" చాలా నామోషిగా వుందండి ఎదురింటి సుబ్బాయమ్మకుంది. పక్కింటి

మీనాక్షికుంది. అబ్బబ్బ ప్రతి నెలతక్కువ వెధవకు వుంది సెల్ మనకు లేదంటే తలెత్తుకు తిరగలేక పోతూన్న! ఇంత పెద్ద ఆఫీసరుకు భార్యనై వుండి సెల్ లేకపోతే ఎంత అవమానం!" శ్రీమతి చెప్పింది.

" నీకు తెలీదే ! ఆఖరికి బాత్‌రూంకు పోయినా దాన్ని వెంట పెట్టుకుపోవాలి! కాల్ మిస్సయిందనుకో - తర్వాత మనకు క్లాస్ తీసుకుంటారు పైవాళ్ళు! మనం ఎక్కడుంది, ఏం చేస్తున్నది వాళ్ళకు తెల్సిపోతూ వుంటుంది. సెల్ లేదనుకో మనం సెలవు పెట్టి ఎక్కడికి పోయినా అడిగేదిక్కు లేదు. అదే సెల్ ఉందనుకో, ఎక్కడున్నా మెసేజ్ యిస్తారు. అది చెయ్యి, ఇది చెయ్యి అని పురమాయిస్తారు. లేని పోని గొడవలు!" తన బాధ చెప్పాడు. తన ఆఫీసుగురించి కొంత వివరించాడు అయినా.

" అయ్యో ! మీకొద్దండి - నాకు కొనండి" చెప్పింది శ్రీమతి.

" నీ ఖర్మ మన సమయం మనది కాదు, సెల్లుంటే నన్ను ఆఫీసులో పని చేసుకోనిచ్చే వాళ్ళు కాదు. ఎప్పుడు ఎవడో ఒకడు మాట్లాడుతుండే వాడు, ఆఫ్ చేద్దామా, ఇంపార్టెంట్ కాల్ మిస్సవుతుంది" వెంకట్రావు బాధపడ్డాడు.

" మీరెన్ని చెప్పినా ! నాకు కావాల్సిందే. సాయంత్రంలోగా సెల్ తీసుకురాకపోతే - పుట్టింటికి పోతాను" బెదిరించింది శ్రీమతి.

" నీ ఖర్మ ! అలాగే కానీ !" వెంకట్రావు అన్నాడో లేదో బయట నుంచి మాటలు వినిపించాయి.

" హలో సుబ్బిగా ! నువ్వు డోర్ నెంబరు సరిగా చెప్పు, ఇక్కడ ఎవడూ ధర్మదాత కనపడలేదు. ఇంతకీ నువ్వెక్కడ చచ్చావ్! ఈ అప్పిగాడ్ని మోసం చేసి నువ్వు బాగుపడవు. ఏంటి నా వీధిలో నువ్వు అడుక్కుంటున్నావా! వెధవ. ఎంత పని చేశావు. వస్తున్నా ఉండు, నీ పని పడతా!"

వెంకట్రావు బయటకొచ్చి చూశాడు. అప్పిగాడు సెల్ ఆఫ్ చేస్తూ కనిపించాడు.

" ఆఖరికి వాడికి ఉండగా మరి నాకొద్దా !" శ్రీమతి అడిగింది.

" నీ ఇష్టం ! ఇప్పుడు సెల్ లేకపోవడమే స్టయిల్ !" వెంకట్రావు చెప్పి

ఆఫీసుకు బయలుదేరాడు.

ఎదురుగా సుబ్బిగాడు - అప్పిగాడు సెల్లులతో కుస్తీ పడుతూ కనిపించారు.

సెల్లాసరుడి విస్తృత రూపం చూసి వెంకట్రావు భయపడి ఆఫీసుకు బయలుదేరాడు.

సెల్ తలచుకుంటేనే గూబ గుయిమంటున్నది!

అవసరమున్నా లేకపోయినా స్టేటస్ కోసం సెల్‌వాడి డబ్బులు పోగొట్టుకోవడం కాకుండా - భవిష్యత్తులో ఆరోగ్యాన్ని గుల్ల చేసుకోబోతున్నారు.

కొత్తొక వింత - పాతొక రోత !

కాలేజి అమ్మాయిల - అబ్బాయిల స్టయిల్సుకైతే అంతే లేదు. కొత్తగా వీడియో సెల్ వచ్చిందంట ! బూతు సినిమాలు దగ్గర్నుండీ అన్నీ వస్తున్నాయండి! సెల్ కాదు కాని బాబోయ్ అదొక హెల్ !.

కాని కొన్ని నరకాలు అనుభవించక తప్పదుగా?

అందుకు వెంకట్రావు సిద్ధమవుతున్నాడు మరి!

( సుప్రభాతం 31-12-2005)